


భక్తి ఉత్సవం..
బాధ్యతే రక్షణ కవచం!

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -96 ఆదివారం 13 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# సహకారమే బ్రిక్స్ చోదకశక్తి




## ప్రధాని మోదీ : 'దిల్లీ డిక్లరేషన్' కు బ్రిక్స్ దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం

**డిక్లరేషన్‌ను ప్రకటించిన ప్రధాని మోదీ**
**పహల్గామ్ దాడిని ఖండిస్తూ బ్రిక్స్ ప్రకటన**
**ప్రధాని నరేంద్ర మోదీ దౌత్య విజయం**
**భారత్ ఆకాంక్షలకు రష్యా, చైనా మద్దతు**
**ఘనంగా ప్రారంభమైన బ్రిక్స్ సమావేశాలు**
**పుతిన్, జిన్‌పింగ్ లకు మోదీ ఘన స్వాగతం**




**న్యూఢిల్లీ సెప్టెంబర్ 12: (జర్నలిస్ట్ వార్త):**
భారత రాజధాని న్యూఢిల్లీలోని ప్రతిష్ఠాత్మక భారత్ మండపం వేదికగా 18వ బ్రిక్స్ సదస్సు అట్టహాసంగా ప్రారంభమైంది. సమావేశంలో న్యూ దిల్లీ డిక్లరేషన్ 2026 కు బ్రిక్స్ కూటమిలోని సభ్య దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. బ్రిక్స్ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చిన భారత్ కు ఇది అతిపెద్ద దౌత్య విజయం అని చెప్పొచ్చు. భారత్ న్యూ దిల్లీ డిక్లరేషన్ కు కూటమిలోని ఏ దేశం కూడా అభ్యంతరం చెప్పకపోవడం విశేషం. ఇది ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. భౌగోళిక రాజకీయ అంశాలపై సభ్య దేశాల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ న్యూ దిల్లీ డిక్లరేషన్ కు ఏకాభిప్రాయం లభించడం భారత్ కు అతిపెద్ద దౌత్య విజయంగా నిలుస్తుందని అన్నారు. అంతర్జాతీయ విధానాలు, ఆర్థిక సహకారం, శాంతిభద్రతలపై సభ్య దేశాల ఉమ్మడి నిబద్ధతను ఈ నిర్ణయం చాటిచెబుతోందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.**మిగతాది 2లో...**

# సాగునీటి ప్రాజెక్టులపై చిత్తశుద్ధి అమోఘం

**చంద్రబాబు చొరవను కొనియాడిన కేంద్ర మంత్రి నడ్డా**



**అమరావతి క్వాంటం బయో వ్యాలీకి కేంద్రం పూర్తి సహకారం**
**ఏపీ 'సంజీవని' కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో పరిశీలిస్తామన్న నడ్డా**
**సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఏపీ సురక్షితంగా ఉందని ప్రశంస**
**'వంటిల్లే ఫార్మసీ-ఆహారమే ఔషధం' అనే నినాదాన్ని సమర్థించిన కేంద్ర మంత్రి**

**అమరావతి సెప్టెంబర్ 12: (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్ర సమగ్రాభివృద్ధికి జీవనాధారమైన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చూపిస్తున్న చిత్తశుద్ధి, పట్టుదల ప్రశంసనీయమని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా కొనియాడారు. కేవలం ఆరోగ్య రంగంపైనే కాకుండా, రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించే కీలకమైన జలవనరులపైనా ముఖ్యమంత్రికి ఉన్న పట్టు అద్భుతమని ఆయన అన్నారు. శనివారం విజయవాడలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, **మిగతాది 2లో...**


# బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ

**సీఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వ్యంగ్యాస్త్రాలు**
**కొండా సురేఖ తొలగింపుపై తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యంగ్యాస్త్రాలు**
**100 రోజుల హామీల అమలుపైనా చురకలు అంటించిన బీఆర్ఎస్**
**అసెంబ్లీ నుంచి సస్పెన్షన్‌కు నిరసనగా ఈ కార్యక్రమం**



# మరో వారం రోజులు వర్షాలు

**హైదరాబాద్ సెప్టెంబర్ 12:**
తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీ చేసింది. **2లో...**



# వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

**గణేశ్ ఉత్సవాలపై సమీక్ష నిర్వహించిన రేవంత్ రెడ్డి**
**మండపాల నిర్వహకులు పోలీస్ స్టేషన్లలో సమాచారం ఇవ్వాలని సూచన**



**హైదరాబాద్, సెప్టెంబర్ 12: (జర్నలిస్ట్ వార్త):**
వినాయక చవితి ఉత్సవాలను ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకూ తావులేకుండా, వైభవంగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. పండుగ వేళ భక్తులకు, మండప నిర్వాహకులకు ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగారు.**మిగతాది 2లో...**

# రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించొద్దు

**: జగన్ కు నారా లోకేశ్ హితవు**
**డీఎస్సీ స్పోర్ట్స్ కోటాపై జగన్ ఆరోపణలకు మంత్రి లోకేశ్ కౌంటర్**
**బాక్సర్ పెద్ద అప్పలరాజు నేషనల్ ఛాంపియన్ అని వెల్లడి**
**ఆధారంగా సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేసిన లోకేశ్**



**అమరావతి సెప్టెంబర్ 12: (జర్నలిస్ట్ వార్త):**
డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ గట్టిగా బదులిచ్చారు. రాజకీయ విమర్శల కోసం రాష్ట్రం గర్వించదగ్గ క్రీడాకారుడిని**మిగతాది 2లో...**

# థాంక్యూ కేరళం

**అదొక దైవిక అనుభూతి..: పవన్ కల్యాణ్ ప్రకటన**

**గత కొన్ని వారాలుగా కేరళలో ఆయుర్వేద చికిత్స తీసుకున్న పవన్ కల్యాణ్**
**చికిత్స అనంతరం కేరళ ప్రజలకు, ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు**

**అమరావతి (జర్నలిస్ట్ వార్త):**
ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ గత కొన్ని వారాలుగా కేరళలో ఆయుర్వేద చికిత్స తీసుకున్న సంగతి తెలిసిందే. తన పర్యటన ముగిసిన నేపథ్యంలో, కేరళలో తనకు లభించిన అనుభవాలు, ఆదరణపై ఆయన శనివారం ఓ సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. కేరళ ప్రజల ఆప్యాయత, ఆతిథ్యానికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతూ, తన పర్యటన ఎంతో ప్రశాంతంగా, మధుర జ్ఞాపకాలతో సాగిందని పేర్కొన్నారు.
**మిగతాది 2లో...**



# ధరణి పేరుతో బీఆర్ఎస్ భూదందా

**: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**
**ధరణి తప్పిదాలతో వందల మంది రైతుల ఆత్మహత్యలు**
**దివాలా తీసిన విదేశీ కంపెనీకి ధరణి నిర్వహణ బాధ్యతలు**
**అసెంబ్లీలో మంత్రి తీవ్ర ఆగ్రహం**
**22ఏపై అసెంబ్లీలో వాడీవేడీగా చర్చ**
**ఈనెల 16కు శాసనసభ వాయిదా**

**హైదరాబాద్, సెప్టెంబర్ 12: (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు భూముల వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది. ముఖ్యంగా 22ఏ నిషేధిత భూముల జాబితా అంశం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. 22ఏకారణంగా రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని, భూముల రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయని, ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. **మిగతాది 2లో...**



# ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతం

**రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో భేటీ అయిన కిషన్ రెడ్డి**
**ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు రక్షణశాఖ సమ్మతి తెలిపిందని వెల్లడి**
**డీపీఆర్, మాస్టర్ ప్లాన్ ప్రక్రియ త్వరగా ముగించాలని నిర్ణయించామన్న కేంద్ర మంత్రి**



**న్యూఢిల్లీ సెప్టెంబర్ 12: (జర్నలిస్ట్ వార్త):**
ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాజెక్టు పురోగతిపై ఈరో ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి **మిగతాది 2లో...**

జర్నలిస్ట్ వార్త



# సహకారమే బ్రిక్స్ చోదకశక్తి

(మొదటి పేజీ తరువాయి)

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలను ఇక ఏమాత్రం ఆలస్యం చేయకూడదని మోదీ స్పష్టం చేశారు. బ్రిక్స్ దేశాలు ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకుంటూ ఏకాభిప్రాయంతో ముందుకు సాగాలని సూచించారు. మనం ఎవరికీ వ్యతిరేకం కాదు, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లేందుకే ప్రయత్నిస్తామని ప్రధాని తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. అధికారాలు, విశేషాధికారాలు ఉన్న అగ్ర దేశాల వ్యవస్థను రాబోయే 20 ఏళ్లలో ఒక భాగస్వామ్య వేదికగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. బ్రిక్స్ సభ్య దేశాల కోసం ఒక సురక్షితమైన డిజిటల్ రిపోజిటరీ (డేటాబేస్) సృష్టించగలమని మోదీ ధీమా వ్యక్తం చేశారు. గ్లోబల్ సంస్కరణల దిశానిర్దేశం చేయడంలో బ్రిక్స్ కీలక పాత్ర పోషించాలన్నారు. సదస్సులో తీసుకున్న నిర్ణయాలను, అంగీకరించిన అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి 'బ్రిక్స్ కంటిన్యూటీ, ఇంప్లిమెంటేషన్ మెకానిజం' ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కష్టకాలంలో ఉన్న గ్లోబల్ సౌత్ దేశాలకు ఈ కూటమి ఎల్లప్పుడూ అండగా నిలవాలని ఆయన కోరారు. ఇక రెండు రోజుల పాటు జరిగే ఈ 18వ బ్రిక్స్ సమావేశంలో భారత్, రష్యా, చైనా, బ్రెజిల్, ఈజిప్ట్, ఇండోనేషియా, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా సహా మొత్తం 21 దేశాలు పాల్గొన్నాయి. అయితే విభేధాలు పక్కన పెట్టి మరీ ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా దేశాలు న్యూ ఢిల్లీ డిక్లరేషన్ కు ఆమోదం తెలపడం కీలకంగా మారింది. న్యూ ఢిల్లీ డిక్లరేషన్ లోని కీలక విషయాలు చూస్తే.. ప్రపంచ వాణిజ్య సంస్థల నిబంధనలకు విరుద్ధంగా, వాణిజ్యాన్ని దెబ్బతీసే విధంగా ఏకపక్ష సుంకాలు పెరగడంపై బ్రిక్స్ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి ఏకపక్ష చర్యలను బ్రిక్స్ దేశాలు ఖండించాయి. అలాగే ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యుద్ధాలు, ఘర్షణలను శాంతి యుతంగా, దౌత్య పరంగా మాత్రమే పరిష్కరించుకోవడానికి తాము కట్టుబడి ఉన్నామని బ్రిక్స్ కూటమి స్పష్టం చేసింది. అలాగే ప్రపంచంలో నెలకున్న



సమస్యలపై వివిధ దేశాలు చూసే దృక్కోణాన్ని తాము స్వాగతిస్తున్నట్లు తెలిపాయి. దాంతోపాటు అంతర్జాతీయ సమస్యలపై శాంతి యుత చర్చలు, భాగస్వామ్యాన్ని నొక్కి చెప్పాయి. అలాగే గతేడాది ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిని బ్రిక్స్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఇది క్రిమినల్ చర్య అని ఎప్పటికీ క్షమించరానిదాని తెలిపాయి. ఈ ఘోర ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా.. మరెందరో గాయపడినట్లు వివరించాయి. ఇలాంటి ఉగ్రవాద చర్యలను అసలు ఉపేక్షించేది లేదని బ్రిక్స్ కూటమి దేశాలు స్పష్టం చేశాయి. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఎదుర్కొనేందుకు తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించాయి. వీటితోపాటు మారుతున్న, వర్తమాన ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని బ్రిక్స్ దేశాలు డిమాండ్ చేశాయి. భారత్ నేతృత్వంలో ఈ బ్రిక్స్ సదస్సు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని తీర్మానించాయి. ఐరాస భద్రతా మండలిలో నిర్మాణాత్మక మార్పులు, ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలకు భద్రతా మండలిలో మెరుగైన ప్రాతినిధ్యం దక్కాలని ఢిల్లీ డిక్లరేషన్ ఆకాంక్షించింది. ముఖ్యంగా భద్రతా మండలిలో భారత్, బ్రెజిల్ దేశాలకు మరింత పెద్ద పాత్ర దక్కాలన్న డిమాండ్‌కు శాశ్వత సభ్య దేశాలైన చైనా, రష్యాలు తమ మద్దతును పునరుద్ఘాటించాయి. ఐఎంఎఫ్?, ప్రపంచ బ్యాంకుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం




దక్కాలని బ్రిక్స్ కూటమి డిమాండ్ చేసింది. వాణిజ్యపరంగా ఈ సదస్సులో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం డాలర్‌కు బదులుగా స్థానిక కరెన్సీలలోనే ఎక్కువగా జరగాలని, సరిహద్దు చెల్లింపుల కోసం ఆచరణాత్మక పరిష్కారాలను సులభతరం చేయాలని డిక్లరేషన్ పేర్కొంది. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా విధిస్తున్న సుంకాలు, బలవంతపు చర్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ ప్రదర్శించాలని పిలుపునిచ్చింది. పహల్గాం ఉగ్రదాడిని బ్రిక్స్ డిక్లరేషన్ తీవ్రంగా ఖండించింది. సరిహద్దు ఉగ్రవాదం, ఉగ్ర నిధులు అరికట్టాలని, ఉగ్రవాద నిర్మూలనలో ద్వంద్వ వైఖరి వీడాలని స్పష్టం చేసింది. అలాగే అణు కేంద్రాలపై జరుగుతున్న దాడులను, పెరుగుతున్న అణ్వస్త్ర ప్రమాదాలను ఖండించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందాల్సిన నిధులను పక్కదారి పట్టిస్తూ, గ్లోబల్ మిలిటరీ ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం పట్ల విచారం వ్యక్తం చేసింది. అలాగే అభివృద్ధి చెందుతున్న దేశాలకు శిలాజ ఇంధనాలు ఇంకా అవసరమేనని స్పష్టం చేస్తూనే, పర్యావరణ అనుకూల ఇంధనాల వైపు మారాలని డిక్లరేషన్ సూచించింది. ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటుకు బ్రిక్స్ దేశాలు తీర్మానించాయి. ఆర్థిక, సామాజిక వృద్ధిలో నిర్ణయాధికారులుగా మహిళల పాత్ర అత్యంత కీలకమని న్యూఢిల్లీ డిక్లరేషన్ గుర్తించింది.

# సాగునీటి ప్రాజెక్టులపై చిత్తశుద్ధి అమోఘం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలవరం ఎడమ కాలువ, వెలిగొండ, హంద్రీ-నీవా వంటి కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడంలో చంద్రబాబు చొరవ రాష్ట్ర ప్రగతికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. సాగునీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారానే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, ఈ దిశగా చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఆరోగ్య శాఖ మంత్రిగా పర్యటనకు వచ్చినప్పటికీ, రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఆయన ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించడం గమనార్హం. రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయ తలపెట్టిన క్వాంటం బయో వ్యాలీకి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనను జేపీ నడ్డా స్వాగతించారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుపై మరింత లోతుగా చర్చించేందుకు, అవసరమైన సూచనలు చేసేందుకు త్వరలోనే కేంద్రం నుంచి ఒక సాంకేతిక బృందాన్ని అమరావతికి పంపుతామని వెల్లడించారు. క్వాంటం బయో వ్యాలీ ఏర్పాటుపై ముఖ్యమంత్రి చేసిన సూచనలు, ఆయన విజన్ అద్భుతంగా ఉన్నాయని, వాటిని తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'సంజీవని' కార్యక్రమంపై నడ్డా ప్రత్యేక ప్రశంసలు కురిపించారు. ప్రజల ఆరోగ్య రక్షణకు ఈ కార్యక్రమం ఒక గొప్ప ముందడుగని అభివర్ణించారు. వ్యాధులను ముందుగానే గుర్తించి, నివారించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని, ఈ లక్ష్యంతో పనిచేస్తున్న సంజీవని కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో అమలు చేసే అవకాశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యం అందించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు కేంద్రం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ సురక్షితమైన చేతుల్లో ఉందని జేపీ నడ్డా అన్నారు. చంద్రబాబు ఒక దార్శనికుడని, నిబద్ధత కలిగిన నాయకుడని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలోనే కాకుండా, విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధిలోనూ చంద్రబాబు పోషిస్తున్న పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన "వంటిల్లే ఫార్మసీ-ఆహారమే ఔషధం" అనే మాటను నడ్డా తన ప్రసంగంలో పలుమార్లు ప్రస్తావించారు. ఆ మాటలు నూటికి నూరు శాతం నిజమని, ఆరోగ్యానికి అదే మూల సూత్రమని వ్యాఖ్యానించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహారపు అలవాట్లపై ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారానే వ్యాధులను దూరం చేయగలమని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తాయని ఆయన స్పష్టం చేశారు.

# ధరణి పేరుతో బీఆర్ఎస్ భూదందా

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపణలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోంది. తాజాగా అసెంబ్లీలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గణాంకాలతో బీఆర్ఎస్‌కు కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 22ఏ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రియల్ ఎస్టేట్ రంగం గణనీయంగా అభివృద్ధి చెందిందని, భూముల విలువలు భారీగా పెరిగాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాల వల్ల రియల్ ఎస్టేట్ రంగంపై ప్రతికూల ప్రభావం పడుతోందని విమర్శించారు. ఈ ఆరోపణలకు అసెంబ్లీ వేదికగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమాధానమిచ్చారు. 22ఏ కారణంగా రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రాబడి తగ్గిపోయాయన్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన గణాంకాలను వెల్లడించారు. మంత్రి అసెంబ్లీకి తెలిపిన వివరాల ప్రకారం.. 2025 ఏప్రిల్, మే, జూన్, జులై, ఆగస్టు ఐదు నెలల కాలంలో రాష్ట్రంలో మొత్తం 4,90,478 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయ్యాయన్నారు. అదే ఐదు నెలల కాలాన్ని 2026లో పరిశీలిస్తే 5,10,273 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయినట్లు తెలిపారు. అంటే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 19,795 డాక్యుమెంట్లు అదనంగా రిజిస్టర్ అయ్యాయని మంత్రి వివరించారు. ఇక రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయాన్ని పరిశీలించినా తగ్గుదల కనిపించలేదని మంత్రి పొంగులేటి తెలిపారు. 2025లో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలల్లో రూ.6,216 కోట్ల ఆదాయం వచ్చినట్లు చెప్పారు. అదే 2026లో ఐదు నెలల కాలంలో రూ.7,575 కోట్ల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. అంటే గత ఏడాదితో పోలిస్తే రూ.1,359 కోట్ల అదనపు ఆదాయం వచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ గణాంకాలను ప్రస్తావిస్తూ 22ఏ వల్ల రిజిస్ట్రేషన్లు, ఆదాయం తగ్గిపోయాయన్న బీఆర్ఎస్ ఆరోపణలను మంత్రి పొంగులేటి తిప్పికొట్టారు. వాస్తవ పరిస్థితిని గణాంకాలే చెబుతున్నాయని స్పష్టం చేశారు. మరోవైపు 22ఏ నిషేధిత భూముల జాబితా విషయంలో మాత్రం రాజకీయ వాదోపవాదాలు కొనసాగాయి. భూముల రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, రియల్ ఎస్టేట్ రంగం, సామాన్యుల భూ హక్కులు వంటి అంశాలు ఈ వివాదంతో ముడిపడి ఉన్నాయి. దీంతో 22ఏ అంశం కేవలం రెవెన్యూ వ్యవహారంగా కాకుండా తెలంగాణ రాజకీయాల్లో కీలకమైన రాజకీయ అంశంగా మారింది. మరోవైపు తెలంగాణ శాసనసభ సాక్షిగా రాష్ట్రంలో నెలకున్న భూ సమస్యలు, 22ఏ నిబంధనలు , ధరణి అక్రమాలపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ధరణి పోర్టల్ ను అడ్డుపెట్టుకుని గత పాలకులు లక్షలాది ఎకరాలను చెరబట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు అసెంబ్లీ సాక్షిగా వారి బండారం బయటపడుతుండటంతోనే సభ నుంచి తప్పించుకొని తిరుగుతున్నారని విమర్శించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను స్వప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో కేసీఆర్ కుటుంబం, వాళ్ల బంధువులు మాత్రమే బాగుపడ్డారని అన్నారు. అలాగే ధరణి తప్పిదాలతో వందల మంది రైతుల ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. తెలంగాణలోని దాదాపు 2.49 కోట్ల ఎకరాల భూమిని తమ సొంత ఆస్తిగా భావించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన సాగించిందని మంత్రి పొంగులేటి మండిపడ్డారు. ధరణి పోర్టల్ నిర్వహణను దివాలా తీసిన ఒక విదేశీ కంపెనీకి అప్పగించారని దుయ్యబట్టారు. ధరణి పోర్టల్ పై ఉన్న నియంత్రణను దుర్వినియోగం చేస్తూ అర్ధరాత్రి సమయాల్లో రిజిస్ట్రేషన్లు చేశారని కీలక ఆరోపణలు చేశారు. ప్రజల ఆస్తులను పరిరక్షించడమే రెవెన్యూ సంస్కరణల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

# థాంక్యూ కేరళం

(మొదటి పేజీ తరువాయి)

గత కొన్ని వారాలుగా తాను తన చికిత్స కోసం కేరళలో ఉన్నానని పవన్ తెలిపారు. "కేరళ ప్రజలకు పేరుగాంచిన ఆప్యాయత, కరుణ, ఆతిథ్యాన్ని స్వయంగా అనుభవించే అవకాశం నాకు లభించింది. నా చికిత్స సమయంలో ఇక్కడ గడిపిన కాలం నాకు మానసిక స్వస్థతను, శాంతిని, ఎన్నో మధుర జ్ఞాపకాలను అందించింది" అని ఆయన పేర్కొన్నారు. తన చికిత్స విజయవంతం చేయడంలో అంకితభావంతో కూడిన సంరక్షణ, వృత్తి నైపుణ్యం, వ్యక్తిగత శ్రద్ధ కనబరిచిన డాక్టర్ సీతారాం ఆయుర్వేదిక్ రిట్రీట్‌లోని వైద్యులు, యాజమాన్యం, సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమయంలో తనకు అందిన సంరక్షణ, మద్దతుకు తాను ఎంతో రుణపడి ఉంటానని చెప్పారు. ఈ పర్యటనలో భాగంగా పలు పవిత్ర దేవాలయాలను సందర్శించే భాగ్యం కూడా తనకు కలిగిందని పవన్ కల్యాణ్ వివరించారు. "త్రిప్రయార్ శ్రీ రామస్వామి, గురువాయూర్ శ్రీ కృష్ణ, మమ్మియూర్ శ్రీ మహాదేవ, చెట్టికులంగర శ్రీ భగవతి అమ్మ ఆలయాలను సందర్శించాను. శతాబ్దాల నాటి సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వారసత్వంతో ముడిపడి ఉన్న ఈ ప్రాచీన ఆలయాలు నాకు గాఢమైన భక్తిని, శాంతిని, ఆత్మపరిశీలనకు అవకాశాన్ని అందించాయి. వాటి కాలాతీతమైన ఆచారాలు, పవిత్ర వాతావరణాన్ని అనుభవించడం నిజంగా దైవికమైనది, సంతృప్తినిచ్చింది. మన ప్రాచీన నాగరికతా వారసత్వానికి కేరళ ఆలయాలు సజీవ రూపాలుగా నిలుస్తాయి" అని ఆయన అభిప్రాయపడ్డారు. తన పర్యటన సాఫీగా సాగేందుకు సహకరించిన కేరళ ప్రభుత్వానికి, గౌరవ ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ కు పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, తన బస ఆసాంతం అవసరమైన ఏర్పాట్లు, సహకారం అందించిన డీజీపీ, కేరళ పోలీసులకు, త్రిస్సూర్, అలప్పుజ, కొచ్చి జిల్లాల పోలీసు బృందాలకు, సంబంధిత జిల్లా యంత్రాంగానికి, స్టేట్ ప్రొటోకాల్ విభాగానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. వారి వృత్తి నైపుణ్యాన్ని, భద్రతా ఏర్పాట్లను ఆయన ప్రశంసించారు. "అన్నింటికంటే ముఖ్యంగా, కేరళ ప్రజల ఆప్యాయత, సద్భావన, అద్భుతమైన ఆతిథ్యానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. వారి వాత్సల్యం, ఇక్కడి ప్రశాంతమైన, ఆధ్యాత్మిక అనుభవాలు నా పర్యటనను ఎంతో ప్రత్యేకంగా మార్చాయి. కేరళ ప్రజల పట్ల ప్రగాఢమైన కృతజ్ఞత, అపారమైన గౌరవం, మధుర జ్ఞాపకాలతో ఇక్కడి నుంచి బయలుదేరుతున్నాను. థ్యాంక్యూ కేరళం" అని పవన్ తన ప్రకటనలో ముగించారు.

# బీఆర్ఎస్‌మాక్ అసెంబ్లీ

## సీఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వ్యంగ్యాస్త్రాలు




కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీ విమర్శనాస్త్రాలు సంధించింది. తమ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో 'మాక్ అసెంబ్లీ' నిర్వహించారు. ఈ వేదిక ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై, ప్రభుత్వ హామీల అమలుపై బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఈ మాక్ అసెంబ్లీలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు స్పీకర్‌గా వ్యవహరించగా, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి పాత్రను పోషించి రేవంత్ రెడ్డిని అనుకరిస్తూ మాట్లాడారు. ఇటీవల మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన అంశాన్ని ప్రస్తావిస్తూ, "కొండా సురేఖ కుమార్తె నా గురించి మాట్లాడినందుకే ఢిల్లీకి వెళ్లి, మూడు రోజులు ఉండి, ఆమెను (సురేఖను) అణచివేసి వచ్చాను. బీసీ బిడ్డనైన నేను సీఎం అయ్యాక, ఆమెను కేబినెట్ నుంచి తీసేయక ఏం చేయగలను?" అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.



కాంగ్రెస్ ప్రకటించిన 100 రోజుల హామీలపైనా తలసాని చురకలంటించారు. "100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పాం కానీ, ఏ 100 రోజుల్లో అని చెప్పామా? ఢిల్లీలో మాకూ కొన్ని ఇబ్బందులు ఉంటాయి కదా" అంటూ ఎద్దేవా చేశారు. తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల ప్రవర్తన, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్యంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై చర్చకు పట్టుబట్టినందుకు గాను, సెప్టెంబర్ 9న కేటీఆర్ తో సహా 22 మంది ఎమ్మెల్యేలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్‌కు నిరసనగానే బీఆర్ఎస్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. కేటీఆర్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్న ఈ వేదికపై, ప్రభుత్వం చర్చకు అనుమతించని ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు.

# వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

(మొదటి పేజీ తరువాయి)

ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, పోలీసు, మున్సిపల్ ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయిన ఆయన... పండుగ నిర్వహణపై సమగ్ర సమీక్ష జరిపారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణలోనే గణేశ్ మండపాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్వాహకులు అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఈ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందొచ్చని సూచించారు. "స్థానిక పోలీస్ స్టేషన్లలో మండపాల సమాచారం ఇవ్వండి. దానివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే కాకుండా, మన భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేయడానికి వీలవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తూ... "మనం అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నామో, గణేశ్ నిమజ్జనాలకు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద క్రేన్లు పెట్టేందుకు వీలుగా చెరువు గట్లు, పరిసరాలను సిద్ధం చేయాలి" అని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటలూ పర్యవేక్షణ ఉండాలని, మున్సిపల్, పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు.

"హైదరాబాద్ ప్రశాంతంగా, సురక్షితంగా ఉంటేనే మన రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయి, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. అందుకే శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. మండపాల నిర్వాహకులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

# మరో వారం రోజులు వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ హెచ్చరించింది. ప్రధానంగా దోమలు, కలుషిత నీరు, గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దోమతెరలు వాడటం, నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడటం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరింది. ఎవరికైనా ఫ్లూ లక్షణాలు కనిపిస్తే జాప్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు స్పష్టం చేశారు.

.

# ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతం

(మొదటి పేజీ తరువాయి)

రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఆయన చర్చించారు.

ఈ భేటీలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ (జేఖూా) అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్ట్ పురోగతిని వేగవంతం చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించినట్టు తెలిపారు. డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు. గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయి స్థలాన్ని పరిశీలించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (×ూఖీ) వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనుందని తెలిపారు. ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పౌర విమానాల సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.


# రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

అవమానించడం తగదని హితవు పలికారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. "పెద్ద అప్పలరాజు ఆంధ్రప్రదేశ్ గర్వించదగ్గ బాక్సర్. ఆయన నేషనల్ ఛాంపియన్. ఆయన సెమీఫైనల్ వీడియోలు ఇప్పటికీ దూరదర్శన్‌లో ఉన్నాయి. రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించడం ఇప్పటికైనా ఆపండి జగన్ గారు" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. తన వ్యాఖ్యలకు ఆధారంగా బాక్సర్ అప్పలరాజు ఆడుతున్న పాత వీడియోను కూడా ఆయన షేర్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగిందని జగన్ ఆరోపణలు చేస్తుండడం తెలిసిందే. నిన్న తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ అక్రమాలపై వెంటనే సీబీఐతో విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. క్రీడల కోటాలో జరిగిన అక్రమాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని జగన్ అన్నారు. అసలు జరగని క్రీడలకు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి, కొందరికి పరీక్ష కూడా నిర్వహించకుండానే ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. ఆ తప్పుడు సర్టిఫికెట్లను ధ్రువీకరించింది, నియామకాలు జరిపింది కూడా వారేనని విమర్శించారు. ఈ విషయంపై అధికారులు కూడా సరైన సమాధానం ఇవ్వలేకపోతున్నారని, సమర్పించిన స్పోర్ట్స్ సర్టిఫికెట్లు అసలైనవో కావో నిర్ధారించలేకపోతున్నారని తెలిపారు. ఈ కుంభకోణంపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఎందుకు స్పందించడం లేదని జగన్ ప్రశ్నించిన నేపథ్యంలో, తాజాగా లోకేశ్ ఓ వీడియో ఆధారంతో కౌంటర్ ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# జాషువా స్ఫూర్తితో జాతి చైతన్యానికి కృషి చేయాలి

## తాటికొండ రాజయ్య





**హైదరాబాద్ /ఆగస్టు 12 (జర్నలిస్ట్ వార్త):** మాదిగ జర్నలిస్టులు మహాకవి గుర్రం జాషువా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్, సదాలక్ష్మి వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని జాతి చైతన్యంతోపాటు సామాజిక న్యాయం కోసం పనిచేయాలని మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య సూచించారు. కోఠిలోని బీసీ సాధికార సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం మూడో మహాసభలు శనివారం జరిగాయి.

మాదిగ సమాజానికి మీడియా పరంగా సొంత గొంతుక అవసరమని, సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వారి చరిత్రను నమోదు చేయాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందని ఆయన అన్నారు. ప్రశ్నించే తత్వంతో పనిచేస్తూ అవసరమైన సందర్భాల్లో జాతి పక్షాన గొంతెత్తాలని సూచించారు. మీడియా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.మాదిగ జర్నలిస్టుల అభివృద్ధికి ప్రత్యేక మీడియా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ మాదిగ కోరారు. టీఎంజేఎఫ్ అన్ని సామాజిక సంఘాలకు అండగా నిలవాలని సీనియర్ జర్నలిస్ట్ పురుషోత్తం సూచించారు. రచయిత పాపని నాగరాజు, సీనియర్ జర్నలిస్ట్ ఇంద్రవెల్లి రమేష్‌తో పాటు ఫోరం రాష్ట్ర నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# పర్యావరణ హితంగా వినాయక చతుర్థి వేడుకలు జరుపుకుందాం.

### -బయ్యారం మాజీ ఎంపీపీ గుగులోత్ కిషన్ నాయక్ పిలుపు.



**బయ్యారం/,సెప్టెంబర్ 12.(జర్నలిస్ట్ వార్త)** సోమవారం నిర్వహించె వినాయక చవితి పండుగను భక్తులందరూ పర్యావరణ పరిరక్షణను ధ్యేయంగా పెట్టుకుని,ఎలాంటి దుబారా ఖర్చులు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని బయ్యారం మాజీ ఎంపీపీ గుగులోత్ కిషన్ నాయక్ విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను పూర్తిగా పక్కనబెట్టి,కేవలం మట్టి విగ్రహాలను మాత్రమే ప్రతిష్టించి పూజించాలని కోరారు. ప్రస్తుతం ఎల్నినో ప్రభావం వల్ల నీటి లభ్యత తక్కువగా ఉన్నందున,నిమజ్జనం చేయడానికి నీళ్ల లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని గుర్తుచేశారు. రసాయనాలతో కూడిన విగ్రహాలు నీటిని మరింత కలుషితం చేస్తాయని తెలిపారు.వినాయక మండపాల వద్ద భక్తుల రక్షణ కోసం విద్యుత్,అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఆడంబరాలకు,అనవసరపు దుబారా ఖర్చులకు దూరంగా ఉంటూ,భక్తిశ్రద్ధలతో పండుగను నిర్వహించుకోవాలని కోరారు.ప్రకృతిని కాపాడుకుంటూ భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, భక్తులందరూ ఈ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని పర్యావరణహిత వినాయక చవితిని జరుపుకోవాలని కిషన్ నాయక్ భక్తులను ఎలా కోరారు.

# ప్రజలకు చేరువగా కాంగ్రెస్ పాలన!

### వెంకట్రావుపల్లి సమస్యలు, బీసీల అంశాలను పీసీసీ చీఫ్ దృష్టికి తీసుకెళ్లిన నేతలు



**హైదరాబాద్/సెప్టెంబర్ 12(జార్నలిస్ట్ వార్త);** పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను వర్ధన్నపేట అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బొక్కల ప్రమోద్, వర్ధన్నపేట మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతం శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు.

వెంకట్రావుపల్లి గ్రామ సమస్యలతో పాటు బీసీలకు సంబంధించిన పలు అంశాలను పీసీసీ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా కుల్ల యాకాంతం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంటూ పాలనను ప్రజల గడప వద్దకు తీసుకువస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ సామాన్య ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉండటం ప్రజా పాలనకు నిదర్శనమన్నారు. బీసీల సమస్యల పరిష్కారంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రైవేట్ ఉపాధ్యాయుల కష్టాలను సుప్రీంకోర్టు గుర్తించడం హర్షణీయం

### ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి: టీపీటీఎఫ్



**ఖమ్మం/సెప్టెంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం జాతీయ విధానం రూపొందించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించడం హర్షణీయమని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం రాష్ట్ర అధికార ప్రతినిధి కొరకొప్పు రామారావు అన్నారు. ఈ వ్యవహారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, జాతీయ ఉపాధ్యాయ విద్యామండలికి నోటీసులు జారీ చేయడాన్ని స్వాగతించారు.ప్రైవేట్ ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం కోసం తమ సంఘం 15 ఏళ్లుగా పోరాడుతోందని రామారావు తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ చాలామంది ఉపాధ్యాయులకు తగిన వేతనాలు అందడం లేదన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ వంటి సౌకర్యాలు లేకపోవడంతో పాటు ఉద్యోగ, ఆరోగ్య భద్రతకు నోచుకోక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.తెలంగాణలో సుమారు మూడు లక్షల మంది, దేశవ్యాప్తంగా 40 లక్షల మంది ప్రైవేట్ ఉపాధ్యాయుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రైవేట్ విద్యా కమిషన్లు ఏర్పాటు చేసి వాటిలో ప్రైవేట్ ఉపాధ్యాయులకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై జాతీయ స్థాయిలో చర్చ జరిగేలా త్వరలో కార్యాచరణ చేపడతామని తెలిపారు.కార్యక్రమంలో చౌహాన్, సాయి నాగరాజు, ప్రశాంత్‌రెడ్డి, ఎస్.గణేష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# గణపతి రూపంలో స్ఫూర్తిదాయక సందేశాలు

### విశ్వశాంతిలో ఘనంగా వినాయక చవితి వేడుకలు



**సత్తుపల్లి/సెప్టెంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** గణనాథుని రూపంలోని ప్రతి అంశం విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే సందేశాన్ని అందిస్తుందని విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని శనివారం పాఠశాలలో వేడుకలు నిర్వహించారు.విద్యార్థులు స్వయంగా తయారు చేసిన మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గణపతి రూపంలోని విశిష్టతను ప్రిన్సిపల్ వివరించారు. పెద్ద తల విశాలంగా ఆలోచించాలనే విషయాన్ని, చిన్న కళ్లు ఏకాగ్రతను, పెద్ద చెవులు మంచి విషయాలను శ్రద్ధగా వినడాన్ని, పెద్ద పొట్ట విజయాపజయాలను సమానంగా స్వీకరించడాన్ని సూచిస్తాయని తెలిపారు.పూజల అనంతరం విద్యార్థులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం నరుకుల్ల సత్యనారాయణ, అవినాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాల వద్ద విద్యుత్ భద్రతా చర్యలు పాటించాలి



**వైరా/సెప్టెంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణేష్ మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ అధికారులు సూచించారు. ఈ మేరకు వైరా డివిజన్, వైరా ఉపవిభాగం, వైరా సెక్షన్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులకు విద్యుత్ భద్రతా చర్యలపై అవగాహన కల్పించే గోడపత్రికను శనివారం ఆవిష్కరించారు.మండపాల వద్ద నాణ్యమైన విద్యుత్ తీగలు, పరికరాలను మాత్రమే వినియోగించాలని అధికారులు సూచించారు. అనధికారిక విద్యుత్ కనెక్షన్లు తీసుకోవద్దని, విద్యుత్ లైన్లకు తగిన దూరంలో మండపాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. విద్యుత్ భద్రతా నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు.కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిజాయితీకి శిక్ష.. అవినీతికి సన్మానమా?

### డబ్బు అధికారం పలుకుబడే గౌరవానికి కొలమానాలా?

నిజం మాట్లాడితే ఇబ్బందులు.నిజాయితీగా బతికితే నష్టాలు. న్యాయంగా వ్యవహరిస్తే వెనుకబడిపోవడం! నేటి సమాజాన్ని గమనిస్తే ఇలాంటి ప్రశ్నలు అప్పుడప్పుడూ మన ముందుకొస్తున్నాయి. ఇది ఎవరో ఒక వ్యక్తిని ఉద్దేశించి వేసే ప్రశ్న కాదు. మన సామాజిక విలువలు ఏ దిశగా వెళుతున్నాయో ఆలోచించాల్సిన అవసరం ఉందన్న హెచ్చరిక.నిజాయితీగా జీవించే మనిషి తన సంపాదనలో ప్రతి రూపాయి వెనుక తన శ్రమను చూస్తాడు. చట్టాన్ని గౌరవిస్తాడు. ఇతరులకు నష్టం కలిగించకుండా ముందుకు సాగాలని ప్రయత్నిస్తాడు. అలాంటి వ్యక్తి జీవితంలో ఎదుగుదల కొంత నెమ్మదిగా ఉండవచ్చు. కానీ అతనికి ఉండే ఆత్మగౌరవం, విశ్వసనీయత మాత్రం విలువైనవి.




మరోవైపు డబ్బు, హోదా, పలుకుబడిని మాత్రమే విజయానికి కొలమానాలుగా చూసే ధోరణి పెరిగితే అది సమాజానికి ప్రమాదకరం. ఎంత సంపాదించాడు అన్నది మాత్రమే కాదు.. ఎలా సంపాదించాడు అన్నది కూడా ప్రశ్నించాలి. కష్టపడి, చట్టబద్ధంగా సంపాదించిన సంపదకు గౌరవం ఉండాలి. అదే సమయంలో అక్రమ మార్గాల ద్వారా సంపాదించిన సంపదను గొప్పతనానికి చిహ్నంగా చూపకూడదు.

అవినీతి అనేది కేవలం ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే వ్యవహారం కాదు. ఎక్కడైనా నిబంధనలను పక్కన పెట్టి వ్యక్తిగత ప్రయోజనం పొందాలనే ఆలోచన మొదలైతే అక్కడే నైతిక పతనం మొదలవుతుంది. ఒకరి తప్పును మరొకరు చూసీ చూడనట్టు వదిలేయడం, తప్పును ప్రశ్నించేవారిని నిరుత్సాహపరచడం కూడా సమస్యను మరింత పెంచుతుంది.అయితే అవినీతి, అక్రమాలపై మాట్లాడేటప్పుడు బాధ్యత కూడా అవసరం. ఆరోపణ అంటే నేరం రుజువైనట్టు కాదు. ఎవరి మీదైనా ఆరోపణలు ఉంటే వాటిని ఆధారాలతో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. దర్యాప్తు, విచారణ, న్యాయస్థాన ప్రక్రియ ద్వారా నిజానిజాలు తేలాలి. తీర్పు వెలువడకముందే ఎవరినైనా నేరస్థుడిగా చిత్రీకరించడం న్యాయసూత్రాలకు విరుద్ధం. అదే సమయంలో చట్టబద్ధమైన ప్రశ్నలను భయపెట్టి లేదా మౌనంతో అణచివేయడం కూడా ప్రజాస్వామ్యానికి మంచిది కాదు.అసలు మార్పు ఎక్కడి నుంచి రావాలి?మన ఇళ్ల నుంచే. పిల్లలకు మంచి ఉద్యోగం, మంచి జీతం గురించి చెప్పడం ఎంత అవసరమో. నిజాయితీగా సంపాదించడం, ఇతరుల హక్కులను గౌరవించడం, చట్టాన్ని పాటించడం గురించి చెప్పడం అంతే అవసరం. డబ్బు సంపాదించడం తప్పు కాదు. కానీ డబ్బు కోసం విలువలను అమ్ముకోవడం మాత్రం సమాజానికి నష్టం.నిజాయితీగా ఉండే వ్యక్తికి వెంటనే ప్రతిఫలం రాకపోవచ్చు. కొన్నిసార్లు అతని మార్గం కఠినంగా ఉండవచ్చు. అయినా అతను తన విలువలను వదులుకోకపోతే అదే అతని నిజమైన విజయం. అబద్ధం, మోసం, అక్రమ మార్గాలు కొంతకాలం ప్రయోజనం ఇచ్చినట్లు కనిపించినా అవి శాశ్వతమైన గౌరవాన్ని ఇవ్వలేవు.గౌరవం కొనలేం. నమ్మకం కొనలేం. వ్యక్తిత్వం కొనలేం.అందుకే సమాజం తన ప్రమాణాలను మార్చుకోవాలి. డబ్బున్నవాడిని మాత్రమే గొప్పవాడిగా చూడకుండా. ఆ డబ్బు సంపాదించిన విధానాన్ని కూడా చూడాలి. పదవిలో ఉన్నవారిని మాత్రమే గౌరవించకుండా. ఆ పదవికి న్యాయం చేస్తున్నారా లేదా అనేది చూడాలి. పలుకుబడి ఉన్నవారిని మాత్రమే ముందుకు తీసుకురాకుండా. సమాజానికి ఉపయోగపడే వ్యక్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి.

నిజాయితీగా బతికే వ్యక్తిని అమాయకుడిగా చూడటం ఆపాలి. నీతి, న్యాయం గురించి మాట్లాడేవారిని చేతకానివారిగా భావించడం ఆపాలి. అదే సమయంలో ఎవరిపైనా నిరాధార ఆరోపణలు చేయకుండా చట్టబద్ధమైన మార్గంలో ప్రశ్నించే సంస్కృతిని పెంచాలి.నిజం కొంతకాలం ఓడిపోయినట్లు కనిపించవచ్చు. కానీ నిజాన్ని పూర్తిగా ఓడించడం ఎవరి వల్లా కాదు.

అవినీతిని అరికట్టేది కేవలం చట్టం కాదు. చట్టాన్ని గౌరవించే పౌర సమాజం. నిజాయితీని కాపాడేది కేవలం ఉపన్యాసాలు కాదు. నిజాయితీగా వ్యవహరించే మనుషులు.చివరికి మనం మనల్ని మనమే ప్రశ్నించుకోవాలిమన పిల్లలకు డబ్బు ఎలా సంపాదించాలో మాత్రమే నేర్పుతున్నామా?

లేక డబ్బును న్యాయంగా ఎలా సంపాదించాలో కూడా నేర్పుతున్నామా?సమాజంలో నిజం, నీతి, న్యాయం, నిజాయితీకి మళ్లీ గౌరవం రావాలి. అక్రమ సంపాదనకు కాదు. కష్టార్జిత సంపదకు విలువ రావాలి. హోదాకు కాదు. వ్యక్తిత్వానికి గౌరవం రావాలి.నిజాయితీకి శిక్ష పడుతున్నట్టు కనిపించే పరిస్థితిని మార్చాల్సింది మరెవరో కాదు.మనమే.

మార్పు కోసం ఎదురుచూడటం కాదు. మార్పుకు మనమే ఆరంభం కావాలి.



సీనియర్ జర్నలిస్ట్ కొట్టే సుధాకర్ (లెనిన్)
టి యు డబ్ల్యూ జే (IJU) జిల్లా కార్యవర్గ సభ్యులు 9908401581

జర్నలిస్ట్ వార్త



# శ్రమదానంతో స్వచ్ఛ కమలాపూర్‌కు బాట

## ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి -సర్పంచ్ పబ్బు సతీష్




**కమలాపూర్/సెప్టెంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని కమలాపూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పబ్బు సతీష్ అన్నారు. స్వచ్ఛ కమలాపూర్ లక్ష్యంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన 'ఊరు కోసం ఒక రోజు' శ్రమదాన కార్యక్రమం 18వ వారానికి చేరుకుంది. శనివారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి శ్రమదానం చేశారు.పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే స్వచ్ఛ కమలాపూర్ లక్ష్యం సాకారమవుతుందన్నారు. పారిశుధ్య పరిరక్షణతోనే ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోగలమన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ మాట్లాడుతూ గ్రామపంచాయతీ పాలకవర్గం చేపట్టిన శ్రమదానంతో పాఠశాల ఆవరణలోని ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు తొలగిపోయి పరిసరాలు ఆహ్లాదకరంగా మారాయని తెలిపారు.కార్యక్రమంలో వార్డు సభ్యులు, నాయకులు మార్క అశోక్, అవునూరి తిరుపతి, పిల్లి సతీష్, ఎండవెల్లి మల్లారెడ్డి, రాంశెట్టి రాజయ్య, తుమ్మ రాజేష్, గంధసిరి బిక్షపతి, పుల్ల ఐలయ్య, మౌటం సంపత్, ఓస్కుల రత్నం, కనుకుంట్ల అరవింద్, శ్రీనివాస్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇనుపరాడ్ గుచ్చుకుని కార్మికుడి మృతి



**హసన్‌పర్తి/సెప్టెంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** ఎస్సార్ యూనివర్సిటీ భవన నిర్మాణ పనుల్లో ప్రమాదవశాత్తు ఇనుపరాడ్ తలకు గుచ్చుకోవడంతో జార్ఖండ్‌కు చెందిన కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ.మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రం లాతేహార్ జిల్లా మురుపు పోస్టు పరిధి బాలుగాడి గ్రామానికి చెందిన పప్పు కుమార్ (31) తన సోదరుడు గుడ్డు భుయ్యా, తోటి మేస్త్రీ ప్రదీప్‌తో కలిసి వరంగల్‌కు వచ్చి ఎస్సార్ యూనివర్సిటీ నిర్మాణ పనుల్లో రాడ్ బెండింగ్ పనులు చేస్తున్నాడు.ఈ నెల 9న ఉదయం 7.30 గంటల సమయంలో భవనంలోని నాలుగో అంతస్తు నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు, గ్రౌండ్ ఫ్లోర్ నుంచి నాలుగో అంతస్తుకు ఇనుపరాడ్లను తరలిస్తుండగా ఓ రాడ్ ప్రమాదవశాత్తు నాలుగో అంతస్తు నుంచి కిందపడింది. అది పప్పు కుమార్ తలకు గుచ్చుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ 10న రాత్రి 10.18 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఈ ఘటనపై మృతుడి సోదరుడు గుడ్డు భుయ్యా (38) శనివారం హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

# విద్యార్థులకు రోబోటిక్స్‌పై శిక్షణ

**ఎల్కతుర్తి/సెప్టెంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):**




మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు రోబోటిక్స్‌పై శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ హేమావతి తెలిపారు. సంక్షేమ కార్యక్రమంలో భాగంగా సోహం అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'హ్యాండ్స్‌ఆన్ రోబోటిక్స్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రోబోటిక్స్‌కు సంబంధించిన ప్రాథమిక అంశాలను పరిచయం చేస్తూ వివిధ ప్రయోగాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సెన్సార్లు, ప్రాథమిక ఎలక్ట్రానిక్ పరికరాలు, ప్రోగ్రామింగ్ తదితర అంశాలను విద్యార్థులకు ప్రయోగాత్మకంగా నేర్పిస్తున్నామని పేర్కొన్నారు. మైండ్‌స్పార్క్, అబ్‌కాస్ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచన, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

# కేశవరెడ్డికి వివిధ పార్టీల నాయకుల నివాళి



**తల్లాడ/సెప్టెంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు దుండేటి కేశవరెడ్డి ఇటీవల మృతి చెందారు. శనివారం గ్రామంలో నిర్వహించిన ఆయన దశదినకర్మ కార్యక్రమానికి వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు హాజరై కేశవరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొట్టేటి జనార్దన్‌రెడ్డి, మోదుగు తిరుమలరావు, రేగళ్ల సత్యం, రవి, బాబు, మల్లయ్య, వెంకటయ్య, దగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, కోడూరు వీరకృష్ణ, ఆదూరి దాసురావు, నారపోగు ప్రసాద్, గుజ్జర్లపూడి చింటూ తదితరులు పాల్గొన్నారు.

# మల్బరీలో నిర్లక్ష్యానికి చెక్ పెట్టాలి

## శాస్త్రవేత్త డా. వజ్రమ్మ, పట్టు పరిశ్రమ శాఖ ఏడీ అనసూయ







**ఎల్కతుర్తి/హనుమకొండ బ్యూరో సెప్టెంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** మల్బరీ సాగులో పాత పద్ధతులకు స్వస్తి పలికి శాస్త్రీయ, ఆధునిక విధానాలను రైతులు తప్పనిసరిగా అవలంబించాలని సీఎస్ఆర్‌టీఐమైసూరు శాస్త్రవేత్త డా. వజ్రమ్మ, పట్టు పరిశ్రమ శాఖ ఏడీ అనసూయ సూచించారు. వ్యాధుల నివారణలో నిర్లక్ష్యం, నాణ్యత లేని నాట్ల ఎంపిక, అధికంగా కూలీలపై ఆధారపడటం వల్ల సాగు వ్యయం పెరిగి రైతులు ఆశించిన స్థాయిలో లాభాలు పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. ఎంఆర్ఎంపి 2.0లో భాగంగా ఎల్కతుర్తిలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సాంకేతిక కార్యక్రమంలో రైతులకు పలు కీలక సూచనలు చేశారు.

### వేరు కుళ్లుపై అప్రమత్తంగా ఉండాలి

మల్బరీ తోటల్లో వేరు కుళ్లు వ్యాధిని తొలిదశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని డా. వజ్రమ్మ సూచించారు. వ్యాధి సోకిన మొక్కలను నిర్లక్ష్యం చేస్తే క్రమంగా తోట మొత్తం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. 'మిస్టర్ ప్రో' రూట్ ప్రొటెక్టర్‌ను శాస్త్రీయ సూచనల మేరకు వినియోగించాలని, తోటల్లో నీటి నిల్వ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వ్యాధి నిరోధక, అధిక దిగుబడినిచ్చే మల్బరీ రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

### కూలీలపై ఆధారపడటం తగ్గించాలి

పెరుగుతున్న కూలీల కొరత, సాగు వ్యయాలను దృష్టిలో ఉంచుకుని రైతులు వ్యవసాయ యాంత్రీకరణ వైపు అడుగులు వేయాలని ఏడీ అనసూయ సూచించారు. బ్యాటరీతో పనిచేసే దస్తర్లు, మల్బరీ కొమ్మల కోత యంత్రాలను వినియోగిస్తే పనులు వేగంగా పూర్తవడంతో పాటు కూలీల ఖర్చు గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. పెద్ద విస్తీర్ణంలో మల్బరీ సాగు చేస్తున్న రైతులు యంత్రాలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు.

### నాణ్యమైన నాట్లతోనే మంచి ఫలితం

మల్బరీ తోట ఏర్పాటు చేసేటప్పుడు నాణ్యమైన నాట్లను ఎంపిక చేసుకోవాలని శాస్త్రవేత్త సూచించారు. మొక్కల పెరుగుదల, ఆకుల నాణ్యత, పట్టు పురుగులకు అందించే ఆహారం వంటి అంశాలపై రైతులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తోట నిర్వహణలో చిన్నపాటి నిర్లక్ష్యం చేసినా దిగుబడిపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు.

### కోకూన్ నాణ్యతపై దృష్టి

అధునాతన పట్టు పురుగు జాతులు, సంకర జాతులను వినియోగించడం ద్వారా కోకూన్ దిగుబడి, నాణ్యతను పెంచుకోవచ్చని అధికారులు తెలిపారు. పట్టు పురుగుల పెంపకంలో పరిశుభ్రత, సరైన ఉష్ణోగ్రత, తేమ, నాణ్యమైన మల్బరీ ఆకుల సరఫరా వంటి అంశాలను నిర్లక్ష్యం చేయరాదన్నారు.

### సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

మల్బరీ సాగులో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకున్నప్పుడే ఉత్పాదకత పెరిగి రైతులకు మెరుగైన ఆదాయం వస్తుందని డా. వజ్రమ్మ, అనసూయ పేర్కొన్నారు. వ్యాధుల నియంత్రణ, యాంత్రీకరణ, నాణ్యమైన మల్బరీ రకాలు, మెరుగైన పట్టు పురుగు జాతుల వినియోగంపై రైతులు నిరంతరం అవగాహన పెంచుకోవాలని సూచించారు. శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ సాగు వ్యయాన్ని తగ్గించి, కోకూన్ నాణ్యతను పెంచుకోవడమే రైతుల ముందున్న మార్గమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్ఎంపి 2.0 జిల్లా నోడల్ అధికారి సంజీవరెడ్డి, వరంగల్ ఏడీ తిరుపతిరెడ్డి, పట్టు పరిశ్రమ అధికారి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు

# కోటగడ్డ శివాలయానికి పూర్వ వైభవం తీసుకురండి

## -దేవాదాయ శాఖకు గ్రామస్తుల విన్నపం.

**బయ్యారం/,సెప్టెంబర్ 12.(జర్నలిస్ట్ వార్త)**

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కోటగడ్డ గ్రామంలోని చారిత్రాత్మక కాకతీయుల నాటి శివాలయం నిరాదరణకు గురవుతోందని ప్రస్తుతం ఆలయ సంరక్షణ చూస్తున్న కోటగడ్డ గ్రామస్తుడు విశాఖ స్టీల్ ప్లాంట్ జనరల్ ఫోర్మెన్ కుంజా బిక్షమయ్య అన్నారు.వందల ఏళ్ల చరిత్ర కలిగి, అద్భుత శిల్పకళతో అలరారే ఈ పురాతన ఆలయం నేడు సరైన సంరక్షణ లేక ప్రాభవాన్ని కోల్పోతోందన్నారు.ఒకప్పుడు వైభవంగా వెలుగొందిన ధూపదీప నైవేద్యాలతో వెలిగిన ఈ క్షేత్రంలో ప్రస్తుతం పరమశివుడికి నిత్య ధూపదీప నైవేద్యాలు కూడా కరువయ్యాయని శివ భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.శిథిలావస్థకు చేరుతున్న శిల్పకళా వైభవం

కాకతీయుల కాలంలో నిర్మించిన ఈ ఆలయ ప్రాంగణం,రాతి స్తంభాలు, గర్భగుడి నాటి శిల్పకళా ప్రతిభకు అద్దం పడతాయి.అయితే, కాలక్రమేణా దేవాదాయ శాఖ పురావస్తు శాఖల పర్యవేక్షణ లేకపోవడంతో ఆధారణకు నోచుకోవడం లేదు.సరైన పూజారి, నిర్వహణ లేకపోవడంతో దేవునికి నైవేద్యం సమర్పించే నాథుడే కరువయ్యాడు.ఆలయ పునర్వైభవానికి







అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, శివభక్తులు కోరుతున్నారు.దేవాదాయ శాఖ అధికారులు వెంటనే కోటగడ్డ గ్రామాన్ని సందర్శించి ఆలయ పరిస్థితిని పరిశీలించాలని భక్తులు కోరుతున్నారు.ఆలయానికి పూజారిని నియమించి,'ధూపదీప నైవేద్య పథకం' కింద నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.కాకతీయుల నాటి ఈ చారిత్రక సంపద ధ్వంసం కాకుండా పునరుద్ధరణ పనులు చేపట్టి,పూర్వ వైభవం తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.మన పురాతన సంస్కృతికి,చారిత్రక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన కోటగడ్డ శివాలయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని,అధికారులు స్పందించి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని స్థానికులు వేడుకుంటున్నారు.

# అమ్మ చేతుల మీదుగా ప్రారంభమైన 'బిఎస్ఆర్ ఫ్యామిలీ రెస్టారెంట్'

**బయ్యారం/,సెప్టెంబర్ 12.(జర్నలిస్ట్ వార్త)**

బయ్యారం మండల కేంద్రానికి చెందిన ఎంబీఏ పట్టభద్రుడు షేక్ బషీర్ స్వయం ఉపాధి ధ్యేయంగా అడుగులు వేశారు.మండల కేంద్రంలోని ఇల్లందు–మహబూబాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న వడ్ల సాంబయ్య వ్యవసాయ క్షేత్రం సమీపాన,ఆహ్లాదకరమైన ప్రకృతి ఒడిలో నూతనంగా ఏర్పాటు చేసిన "బిఎస్ఆర్ ఫ్యామిలీ రెస్టారెంట్" శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బయ్యారం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సుమన్ రెడ్డి పాల్గొన్నారు.బషీర్ మాతృమూర్తి రిబ్బన్ కట్ చేసి రెస్టారెంట్‌ను అధికారికంగా ప్రారంభించారు.పట్టణాలకు ధీటుగా గ్రామీణ ప్రాంత ప్రజలకు, ప్రయాణికులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో రుచికరమైన,పరిశుభ్రమైన ఆహారాన్ని అందించేందుకు ఈ రెస్టారెంట్‌ను





బషీర్ రూపుదిద్దారు.ఎంబీఏ పూర్తి చేసి ఉద్యోగాల కోసం వేచి చూడకుండా,స్వయంగా వ్యాపార రంగాన్ని ఎంచుకుని నలుగురికి మార్గదర్శకంగా నిలిచిన షేక్ బషీర్‌ను పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో బషీర్ బంధుమిత్రులు, స్థానిక గ్రామీణులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని రెస్టారెంట్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.ప్రకృతి రమణీయతల నడుమ రుచికరమైన వంటకాలతో సేవలు అందించడానికి సిద్ధమైన 'బిఎస్ఆర్ ఫ్యామిలీ రెస్టారెంట్' స్థానికులను, రహదారి ప్రయాణికులను ఆకట్టుకుంటుందని నిర్వాహకుడు బషీర్ ధీమా వ్యక్తం చేశారు.

# తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో సమరశీల పోరాటాలు

## సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి

**హసన్‌పర్తి/సెప్టెంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్‌లో మెట్టు శ్యాంసుందర్‌రెడ్డి అధ్యక్షతన శనివారం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ.. నైజాం పాలనలో భూస్వాముల దోపిడీ, నిర్బంధాలు, మహిళలపై అఘాయిత్యాలకు వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేశారని తెలిపారు. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సాగిన తెలంగాణ రైతాంగ



సాయుధ పోరాటం నైజాం, భూస్వామ్య పెత్తందారుల పాలనకు చరమగీతం పాడిందన్నారు. బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూమ్ మొహియుద్దీన్, నల్ల నరసింహులు, రావి నారాయణరెడ్డి వంటి పోరాట యోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిరంకుశ విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. రైతుల ఆదాయం రెట్టింపు, ఉద్యోగాల కల్పన వంటి హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతులు, కార్మికులు, ప్రజలు సాగించిన ఉద్యమాలు ప్రభుత్వాలపై పెరుగుతున్న ప్రజా వ్యతిరేకతకు నిదర్శనమన్నారు.సీనియర్ నాయకుడు మోతె లింగారెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, పౌర హక్కుల పరిరక్షణకు ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు.కార్యక్రమంలో షేక్ బాబు, రేణికుంట్ల రాజయ్య, గోపు బుచ్చిరెడ్డి, గోపు శ్రీనివాస్‌రెడ్డి, ముజ్జిగ పరశురాములు, గోపరాజు భద్రయ్య, మహిపాల్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతులతోనే పర్యావరణ పరిరక్షణ



**హసన్‌పర్తి/సెప్టెంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని అనంతసాగర్‌కు చెందిన అర్చకులు బూరుగుపల్లి విజయ్‌కుమార్ సూచించారు. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితమై జలచరాలు, పశుపక్ష్యాదులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. మట్టి గణపతుల వినియోగంతో పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదని తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు, భూమిని అందించేందుకు ప్రజలు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. గణనాథుడిని భక్తిశ్రద్ధలతో పూజిస్తూ పర్యావరణాన్ని కాపాడాలని, ప్రజలంతా పాడిపంటలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

# కేశవరెడ్డి మృతి దురదృష్టకరం



**తల్లాడ/సెప్టెంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** అందరితో సౌమ్యంగా, ఆప్యాయంగా మెలిగే కేశవరెడ్డి అకాల మృతి దురదృష్టకరమని రాష్ట్ర ఇండస్ట్రియల్ చైర్మన్ మువ్వా విజయబాబు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. శనివారం తల్లాడ మండలంలోని గొల్లగూడెంలో నిర్వహించిన కేశవరెడ్డి దశదిన కార్యక్రమానికి వారు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేశవరెడ్డి మృతి కుటుంబ సభ్యులతోపాటు ఆయనను అభిమానించే వారికి తీరని లోటన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్‌చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లు, వైరా మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కాపా సుధాకర్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

# చిన్నారి అద్వంత్‌కు కాంగ్రెస్ నాయకుల ఆశీర్వాదం



**తల్లాడ/సెప్టెంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం నూతనకల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కళ్యాణపు వెంకటేశ్వరరావు, సీత దంపతుల మనవడు, అశోక్‌అమూల్య దంపతుల కుమారుడు అద్వంత్ మొదటి జన్మదిన వేడుకలు శనివారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు.
ఈ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి, సొసైటీ చైర్మన్, సీనియర్ నాయకుడు దిరిశాల నరసింహారావు, దీవెల కృష్ణయ్య, మారెళ్ల మల్లికార్జున్‌రావు, తుమ్మలపల్లి రమేష్, పొట్రూ శరత్, సర్పంచ్ కాళోజి, తాళ్ల జోసెఫ్, రాయల రాము, అడపా అనిల్ చౌదరి, గణేశుల రవి, మాజీ జడ్పీటీసీ మూకర ప్రసాద్, పగడాల లచ్చిరెడ్డి, అయినాల నరసింహారావు తదితర గ్రామ నాయకులు, వివిధ పార్టీల నాయకులు హాజరయ్యారు. చిన్నారి అద్వంత్‌కు అక్షింతలు వేసి ఆశీర్వదించి, ఆయురారోగ్యాలతో సంతోషంగా ఎదగాలని ఆకాంక్షించారు.

# రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ముగ్గురు



**ఐనవోలు/సెప్టెంబరు 12 (జర్నలిస్ట్ వార్త):** ఐనవోలు మహాత్మా జ్యోతిబా పూలే బాలుర పాఠశాలకు చెందిన టీ. మాధవ వర్ధన్, పి. చరణ్, ఎం. అశ్వంత్ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 3న హనుమకొండలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ నెల 12, 13 తేదీల్లో బెల్లంపల్లి తిలక్ స్టేడియంలో జరిగే పోటీల్లో హనుమకొండ జిల్లా తరఫున పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ తిరునగిరి శ్రీలత, ఉపాధ్యాయ బృందం, వ్యాయామ ఉపాధ్యాయుడు సందీప్ వారిని అభినందించారు.

# కేశవరెడ్డి మృతి బాధాకరం


## కుటుంబానికి అండగా ఉంటాం.. తుంబూరు దయాకర్‌రెడ్డి



**తల్లాడ/సెప్టెంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన కేశవరెడ్డి అకాల మృతి ఎంతో బాధాకరమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. శనివారం గ్రామంలో నిర్వహించిన కేశవరెడ్డి దశదిన కర్మ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కేశవరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కేశవరెడ్డి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ విభాగం వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లు, తల్లాడ మండల అధ్యక్షుడు గోడుగునూరి లక్ష్మారెడ్డి, నాయకులు తుమ్మలపల్లి రమేష్, వెర్రి నరసింహారావు, కోడూరు వీరకృష్ణ, దిరిశాల నరసింహారావు, జీవుల కృష్ణయ్య, ప్రసాద్, వెంకటేశ్వరరావు, ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ యాకూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

# పంట నమోదు పరిశీలన

## 8 గ్రామాల్లో సజావుగా.. నాలుగు చోట్ల మ్యాప్‌ల సమస్య






**వర్ధన్నపేట/సెప్టెంబరు 12(జర్నలిస్ట్ వార్త);** మండలంలో కొనసాగుతున్న డిజిటల్ పంట నమోదు ప్రక్రియను జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ భాస్కర్, సాంకేతిక వ్యవసాయ అధికారి దేవేందర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కట్రాల, నల్లబెల్లి, వర్ధన్నపేట, ఇల్లంద గ్రామాల్లో సర్వేను పరిశీలించి సర్వేయర్లకు సూచనలు చేశారు. ప్రతి సర్వే నంబర్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, తప్పిదాలకు తావులేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. 12 గ్రామాల్లో 8 చోట్ల మ్యాప్‌లు సక్రమంగా ఉండటంతో సర్వే సజావుగా సాగుతోందని, నాలుగు గ్రామాల్లో మ్యాప్‌ల సమస్య ఉందని తెలిపారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

# విదేశాల్లో చదివే విద్యార్థులకు రూ.180 కోట్లు విడుదల చేసిన తెలంగాణ సర్కార్

**హైదారాబాద్, సెప్టెంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ప్రభుత్వం విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు భారీ ఊరట కల్పించింది. పెండింగ్‌లో ఉన్న ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల కోసం రూ.179.9 కోట్లను తాజాగా విడుదల చేసింది. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిధుల కేటాయింపు జరిగింది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,008 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. విడుదలైన నిధుల్లో అత్యధికంగా ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద 1,063 మంది మైనారిటీ విద్యార్థులకు రూ.76.1 కోట్లు కేటాయించారు. అలాగే, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి



ద్వారా 1,193 మంది ఎస్సీ విద్యార్థులకు రూ.48.4 కోట్లు, 573 మంది ఎస్టీ విద్యార్థులకు రూ.36.9 కోట్లు, మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యా నిధి కింద 179 మంది బీసీ విద్యార్థులకు రూ.18.4 కోట్లు అందజేయనున్నారు. ఇప్పటికే స్కాలర్‌షిప్‌లు మంజూరైన లబ్ధిదారులందరికీ చెల్లింపులు పూర్తయ్యాయని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో తమ చదువును ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించేందుకు ఈ నిధులు దోహదపడతాయని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.

# కరెంటు కోతలపై రైతుల ఆగ్రహం

## కందుకూరులో విద్యుత్తు ఉపకేంద్రం ముట్టడి





**వేంసూరు/సెప్టెంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** విద్యుత్తు కోతలను నిరసిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. వేంసూరు మండలం కందుకూరులో కందుకూరు, దిద్దుపూడి, భరణిపాడు, లచ్చన్నగూడెం గ్రామాలకు చెందిన రైతులు శనివారం ర్యాలీ నిర్వహించి విద్యుత్తు ఉపకేంద్రాన్ని ముట్టడించారు. విద్యుత్తు సరఫరా సక్రమంగా లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ ఆందోళనకు సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 గంటల ఉచిత విద్యుత్తు అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ఏడు గంటల విద్యుత్తును కూడా సక్రమంగా సరఫరా చేయడం లేదని విమర్శించారు. కరెంటు ఎప్పుడు వస్తుందో. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ముందస్తు ప్రణాళిక రూపొందించి, అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్తు కొనుగోలు చేసి అయినా నిరంతర సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

**ఎరువుల పంపిణీపై విమర్శ**

ఎరువుల కోసం రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని సండ్ర కోరారు. యాప్ ద్వారా ఎరువులు పంపిణీ చేయడం వల్ల స్మార్ట్‌ఫోన్లు లేని రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో మాదిరిగా కూపన్ల విధానంలో ఎరువులు అందించాలని సూచించారు. అవసరమైన మేరకు ముందుగానే ఎరువుల నిల్వలు ఏర్పాటు చేయాలని కోరారు.

**హామీలు అమలు చేయాలి**


వరంగల్ రైతు డిక్లరేషన్‌లో అన్ని రకాల పంటలకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి.. ప్రస్తుతం కొన్ని పంటలకే పరిమితం చేయడం సరికాదని సండ్ర అన్నారు. రైతు కూలీలకు అండగా ఉంటామని, రైతు భరోసా పెంచుతామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.
సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి గత ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చించి పనులు చేపట్టిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టు ఘనతను తన ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.

**లాగ్‌బుక్ పరిశీలన**

సండ్ర వెంకట వీరయ్య విద్యుత్తు ఉపకేంద్రంలోని సరఫరా లాగ్‌బుక్‌ను పరిశీలించారు. రైతులకు ఎంతసేపు విద్యుత్తు సరఫరా అవుతోంది. ఎంతసేపు అంతరాయం ఏర్పడుతోందనే వివరాలను పరిశీలించారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే రైతులతో కలిసి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# భారీగా పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు

## కొత్తగా 1,010 సీట్లు అందుబాటులోకి -10,450కి చేరిన మొత్తం సీట్ల సంఖ్య



**హైదారాబాద్, సెప్టెంబర్ 12: (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ వైద్య విద్యలో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో కొత్తగా 1,010 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో 2026--27 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని 66 మెడికల్ కాలేజీల్లో మొత్తం ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 10,450కి చేరింది. దేశవ్యాప్తంగా మెడికల్ సీట్ల వివరాలతో మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డు శుక్రవారం విడుదల చేసిన సీట్ మ్యాట్రిక్స్‌లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. తాజా పెంపుతో అత్యధిక ఎంబీబీఎస్ సీట్లు ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఐదో స్థానానికి చేరింది. రాష్ట్రంలో ప్రస్తుతం 36 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 4,400 సీట్లు ఉన్నాయి. వీటిలో 4,290 సీట్లు గత సీట్లకు రెన్యువల్ కాగా.. కొత్తగా మరో 110 సీట్లు పెరిగాయి. మహబూబ్‌నగర్, సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 25 చొప్పున, నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఆదిలాబాద్ రిమ్స్‌లో 30 చొప్పున సీట్లు పెరిగాయి. రాష్ట్రంలోని 30 ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో మొత్తం 6,050 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 5,150 సీట్లు రెన్యువల్ కాగ.., కొత్తగా 900 సీట్లు చేరాయి. కొత్తగా ఏర్పాటైన రాజరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో 150 సీట్లు కేటాయించారు. మిగిలిన సీట్లు ఇప్పటికే ఉన్న పలు ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో సీట్ల పెంపు ద్వారా అందుబాటులోకి వచ్చాయి. కొత్త సీట్లతో రాష్ట్రంలో వైద్య విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు మరిన్ని అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య, సీట్ల సామర్థ్యం పెరుగుతున్న నేపథ్యంలో వైద్య విద్యను జిల్లాల స్థాయికి విస్తరించే ప్రయత్నాలకు ఇది మరింత ఊతమివ్వనుంది. ఎయిమ్స్, జిప్‌మర్ వంటి జాతీయ ప్రాధాన్యం ఉన్న సంస్థలను మినహాయిస్తే దేశవ్యాప్తంగా 836 మెడికల్ కాలేజీల్లో 1,40,214 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఇందులో 445 ప్రభుత్వ కాలేజీల్లో 63,971 సీట్లు, 391 ప్రైవేట్ కాలేజీల్లో 76,243 సీట్లు ఉన్నాయి. కొత్త కాలేజీలు, సీట్ల పెంపు ద్వారా ఈ ఏడాది దేశవ్యాప్తంగా 13,186 సీట్లు అదనంగా అందుబాటులోకి వచ్చాయి. మరో 1,27,028 సీట్లు రెన్యువల్ అయ్యాయి. దేశంలో 15,745 సీట్లతో కర్ణాటక మొదటి స్థానంలో ఉంది. ఉత్తరప్రదేశ్ 14,400, తమిళనాడు 14,299, మహారాష్ట్ర 13,249 సీట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 40 మెడికల్ కాలేజీల్లో మొత్తం 7,615 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. మెడికల్ కాలేజీలు తమకు మంజూరైన సీట్ల మేరకే అడ్మిషన్లు ఇవ్వాలని జాతీయ వైద్య కమిషన్ స్పష్టం చేసింది. ఒక్క సీటు అదనంగా భర్తీ చేసినా ఎన్ఎంసీ చట్టం-2019 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అవసరమైతే క్రిమినల్ చర్యలతోపాటు జరిమానాలు విధించే అవకాశం ఉందని తెలిపింది. కౌన్సెలింగ్ కమిటీలు కూడా అనుమతించిన సీట్లకు మించి ప్రవేశాలు కల్పించకూడదని స్పష్టం చేసింది. కొత్తగా అనుమతి పొందిన లేదా సీట్లను పెంచుకున్న ప్రైవేట్ మెడికల్ కాలేజీలు ఏడు రోజుల్లోగా ఎంఏఆర్‌బీ డైరెక్టర్ పేరిట ఎలక్ట్రానిక్ బ్యాంక్ గ్యారంటీ సమర్పించాలని స్పష్టం చేసింది. దాని పరిశీలన పూర్తయిన తర్వాతే లెటర్ ఆఫ్ పర్మిషన్ జారీ చేయనున్నట్లు ఎన్ఎంసీ వెల్లడించింది.

# 25,000 క్యాబ్ డ్రైవర్ల సమ్మె..
## శంషాబాద్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు

**హైదరాబాద్ సెప్టెంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ)లో క్యాబ్ సేవలు పూర్తిగా స్తంభించిపోయాయి. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టీజీపీడబ్ల్యూయూ) ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నుంచి దాదాపు 25,000 మంది క్యాబ్ డ్రైవర్లు సమ్మె చేపట్టారు. ఓలా, ఉబెర్, రాపిడో వంటి ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఎయిర్‌పోర్ట్ ట్రిప్పులను డ్రైవర్లు పూర్తిగా బహిష్కరించారు.



ప్రభుత్వం 2022 డిసెంబర్ 9న జారీ చేసిన జీవో 46ను తక్షణమే అమలు చేయాలన్నది డ్రైవర్ల ప్రధాన డిమాండ్. ఈ జీవో ప్రకారం, ఎయిర్‌పోర్ట్ ప్రీపెయిడ్ సర్వీసులకు కిలోమీటరుకు రూ. 21 చొప్పున ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ప్రస్తుతం తమకు కిలోమీటరుకు కేవలం రూ. 12 నుంచి రూ. 15 మాత్రమే అందుతున్నాయని యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ ఆరోపించారు.

ఈ అంశంపై ఆగస్టు 31న కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు, కంపెనీల యాజమాన్యాలతో కీలక సమావేశం జరిగింది. జీవో నిబంధనల ప్రకారం ఛార్జీలు చెల్లించాలని అధికారులు ఆదేశించినప్పటికీ, సదరు కంపెనీలు వాటిని బేఖాతరు చేశాయని యూనియన్ ఆవేదన వ్యక్తం చేసింది.
"మేము ఎలాంటి ప్రత్యేక సౌకర్యాలు కోరడం లేదు. మాకు దక్కాల్సిన చట్టబద్ధమైన ఛార్జీలతో పాటు వృత్తిపరమైన గౌరవం, సమానత్వం కావాలి" అని అన్నారు. ఈ సమస్యలపై సమగ్రంగా చర్చించి, లిఖితపూర్వక హామీ ఇచ్చేందుకు ప్రభుత్వం వెంటనే సంబంధిత భాగస్వామ్య పక్షాలతో సమావేశం ఏర్పాటు చేయాలని యూనియన్ విజ్ఞప్తి చేసింది.

# మన డైట్ మారాలి..
## అప్పుడే భారత్‌లో మరింత మంది ఛాంపియన్లు: వేదాంత్ మాధవన్

**భారత్‌లో క్రీడా ప్రతిభకు కొదవ లేదన్న వేదాంత్ మాధవన్**
**ఆహారపు అలవాట్లలో మార్పు అవసరమని వ్యాఖ్య**
**ప్రొటీన్ ఎక్కువగా తీసుకోవాలని సూచన**
**డైటీషియన్ సలహాలతో తన ఫిట్‌నెస్ మెరుగైందని వెల్లడి**
**ఆసియా క్రీడల్లో 200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో పోటీ**

**న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):**
భారత్‌లో ప్రతిభకు కొదవ లేదని.. కానీ ఆ ప్రతిభకు తగ్గ ఫలితాలు రావాలంటే ఆహారపు అలవాట్లలో మార్పు రావాలని ప్రముఖ నటుడు ఆర్. మాధవన్ కుమారుడు, స్విమ్మర్ వేదాంత్ మాధవన్ అభిప్రాయపడ్డాడు. సరైన ఆహారం, క్రమశిక్షణ, పట్టుదల ఉంటే భారత్ నుంచి మరింత మంది అత్యుత్తమ క్రీడాకారులు రావచ్చని చెప్పాడు. ప్రస్తుతం ఆసియా క్రీడలకు సిద్ధమవుతున్న అతడు.. భారత క్రీడారంగం ఎదుర్కొంటున్న అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నాడు.
2026 ఆసియా క్రీడలు జపాన్‌లోని ఐచి ప్రిఫెక్చర్ (రాష్ట్రం), నాగోయాలో సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్నాయి. ఈ పోటీల్లో వేదాంత్ భారత్ తరఫున స్విమ్మింగ్‌లో బరిలోకి దిగనున్నాడు. శ్రీహరి నటరాజ్, సాజన్ ప్రకాశ్ వంటి అనుభవజ్ఞులైన స్విమ్మర్లతో కలిసి అతడు



పోటీపడనున్నాడు.
పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో వేదాంత్ మాట్లాడుతూ.. భారతీయుల్లో సహజంగానే మంచి ప్రతిభ ఉంటుందన్నాడు. ఆహారం, క్రమశిక్షణ, ప్రేరణపై మరింత దృష్టి పెడితే ప్రపంచ స్థాయిలో మంచి క్రీడాకారులను తయారు చేయొచ్చని అభిప్రాయపడ్డాడు.
భారతీయుల ఆహారంలో ప్రొటీన్ మరింత పెరగాల్సిన అవసరం ఉందని వేదాంత్ చెప్పాడు. శరీర నిర్మాణంలో కొన్ని ప్రత్యేక లక్షణాల వల్ల కొవ్వు నిల్వ ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వివరించాడు. అందుకే సరైన ఆహారంతో శరీరాన్ని తీర్చిదిద్దుకోవడం ముఖ్యమన్నాడు.
తాను కూడా డైటీషియన్ సలహాలు తీసుకుంటున్నట్లు తెలిపాడు. ఆహారంలో మార్పులు చేసుకోవడం వల్ల తన ఫిట్‌నెస్, వేగంలో మంచి మార్పు కనిపించిందని చెప్పాడు. భారతీయులు తమ ఆహారంపై శ్రద్ధ పెడితే ఉన్న ప్రతిభను మరింతగా ఉపయోగించుకోగలమని అభిప్రాయపడ్డాడు. వేదాంత్ ప్రధానంగా లాంగ్ డిస్టెన్స్ స్విమ్మర్. అయితే ఆసియా క్రీడల్లో 200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో పోటీ పడనున్నాడు. ఇది తనకు అలవాటైన విభాగానికి భిన్నమని చెప్పాడు. గత కొన్ని నెలలుగా వెయిట్ ట్రైనింగ్, స్ట్రెంత్ కండిషనింగ్‌పై ఎక్కువగా దృష్టి పెట్టినట్లు తెలిపాడు. ముఖ్యంగా కాళ్ల బలం, కిక్స్, చీలమండల సౌలభ్యాన్ని మెరుగుపరుచుకుంటున్నానని చెప్పాడు.
ప్రపంచ స్థాయి పోటీల్లో కోట్లాది మంది చూపు మనపై ఉన్నప్పుడు ఒత్తిడి సహజమేనని వేదాంత్ అన్నాడు. అలాంటి సమయంలో తాను గెలవగలననే నమ్మకం క్రీడాకారుడికి ఉండాలని చెప్పాడు.
విజయం సాధించాలంటే కొంత ఆత్మవిశ్వాసం, గెలవాలనే పట్టుదల అవసరమని పేర్కొన్నాడు. పెద్ద లక్ష్యాన్ని పెట్టుకుని ముందుకు సాగితే కనీసం దాని దిశగా అయినా చాలా దూరం వెళ్లగలమని చెప్పాడు.

# భక్తి ఉత్సవం..
# బాధ్యతే రక్షణ కవచం!
## గణేష్ ఆగమనం.. ఉత్సాహం ఉండాలి, ఉన్మాదం కాదు!

**వినాయకుడి వేడుక.. ప్రమాదాలకు తావులేకుండా!**
**భక్తి బాటలో భద్రత.. గణేష్ ఆగమనానికి ఇదే స్ఫూర్తి!**
**గణేష్ ఆగమన్: సంబరాల మధ్య జాగ్రత్తలే శ్రీరామరక్ష!**
**గణపతి ఆగమనం.. ప్రతి అడుగూ అప్రమత్తం!**
**ఉత్సవం మనదే.. బాధ్యత కూడా మనదే!**
**గణేష్ ఆగమన్‌లో భక్తితో పాటు భద్రతే ముఖ్యం**

**హైదరాబాద్ /అమరావతిసెప్టెంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):**
వినాయక చవితి సందర్భంగా గణనాథుడి ఆగమనం ప్రతి ప్రాంతంలో ఆధ్యాత్మిక సందడి, భక్తి ఉత్సాహాన్ని నింపుతుంది. యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వినాయక విగ్రహాలను మండపాలకు తరలించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ ఉత్సాహం ఎక్కడా ప్రమాదాలకు దారితీయకుండా నిర్వాహకులు, భక్తులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.
గణేష్ ఆగమన్ సమయంలో ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలి. ఊరేగింపుకు సంబంధించిన మార్గాన్ని ముందుగానే నిర్ణయించుకుని, పోలీసు శాఖకు సమాచారం అందించడం మంచిది. ప్రధాన రహదారులు పూర్తిగా దిగ్బంధం కాకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాలి. అంబులెన్స్‌లు, ఫైర్ సర్వీసులు వంటి అత్యవసర వాహనాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలి.
విగ్రహాలను తరలించే వాహనాల విషయంలో మరింత అప్రమత్తత అవసరం. వాహన సామర్థ్యానికి మించి భక్తులను ఎక్కించకూడదు. వాహనం కదులుతున్న సమయంలో ఎవరూ దానిపై నిలబడటం, వేలాడటం లేదా ప్రమాదకర విన్యాసాలు



చేయడం చేయరాదు. డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడపకుండా నిర్వాహకులు నిర్ధారించాలి.
యువత ఉత్సాహంతో బైక్‌లపై ర్యాలీలు, వేగంగా వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలి. భక్తి కార్యక్రమం ఆనందంగా సాగాలంటే ప్రతి ఒక్కరి ప్రాణ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి.
శబ్ద కాలుష్యం విషయంలో కూడా బాధ్యత అవసరం. అధిక శబ్దంతో డీజేలు, సౌండ్ సిస్టమ్‌లు ఉపయోగించడం వల్ల వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా శబ్ద పరిమితులను పాటించడం నిర్వాహకుల బాధ్యత.
విద్యుత్ తీగలు ఉన్న ప్రాంతాల్లో భారీ విగ్రహాలను తరలించేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ శాఖ సిబ్బంది సహకారంతో ప్రమాదకర ప్రాంతాలను ముందుగానే గుర్తించాలి. మండపాల వద్ద విద్యుత్ కనెక్షన్లు సురక్షితంగా ఉండేలా చూసుకోవాలి. అగ్నిప్రమాదాలను నివారించేందుకు ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ వంటి ప్రాథమిక భద్రతా పరికరాలు అందుబాటులో ఉంచడం మంచిది.
అదేవిధంగా పర్యావరణ పరిరక్షణ కూడా గణేష్ ఉత్సవాల్లో ముఖ్యమైన అంశం. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌కు బదులుగా పర్యావరణహిత మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలి. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, ఊరేగింపు అనంతరం రోడ్లపై చెత్త పేరుకుపోకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలి.
చిన్నారులు, మహిళలు, వృద్ధులు ఊరేగింపులో పాల్గొన్నప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. జనసమ్మర్థంలో పిల్లలు తప్పిపోకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. అత్యవసర పరిస్థితుల్లో పోలీసు, అగ్నిమాపక, వైద్య సిబ్బందిని సంప్రదించే విధానం గురించి నిర్వాహకులకు స్పష్టమైన ప్రణాళిక ఉండాలి.
వినాయకుడి ఆగమనం భక్తికి ప్రతీక. ఆ భక్తి మరొకరికి ఇబ్బంది కలిగించకుండా, ఎవరి ప్రాణానికీ ప్రమాదం కలగకుండా సాగినప్పుడే ఉత్సవానికి అసలైన అర్థం చేకూరుతుంది.
అందుకే "భక్తి మనసులో ఉండాలి.. బాధ్యత ప్రతి అడుగులో ఉండాలి" అనే సందేశంతో గణేష్ ఆగమన్‌ను ప్రశాంతంగా, క్రమశిక్షణతో, పర్యావరణహితంగా నిర్వహిద్దాం. గణనాథుడి ఆశీస్సులతో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియేలా, ప్రతి ఊరేగింపు సురక్షితంగా సాగేందుకు అందరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి.

# లైంగిక వేధింపుల ఆరోపణలు..
## 'ఢీ-10' డ్యాన్స్ షో విన్నర్ రాజు అరెస్ట్

**హైదరాబాద్ సెప్టెంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):**
తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన 'ఢీ-10' డ్యాన్స్ షో విజేత రాజును హైదరాబాద్ మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా సినిమా అవకాశాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేశాడని ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది. వివరాల్లోకి వెళితే.. ఓ యువతి ఈ నెల 9న మియాపూర్ పోలీసులకు రాజుపై ఫిర్యాదు చేసింది. తనను లైంగికంగా వేధించాడని, సినీ రంగంలో అవకాశాల పేరుతో వంచించాడని ఫిర్యాదులో పేర్కొంది. దీని ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆరోపణలకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు లభించడంతో రాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, రాజు అరెస్ట్ విషయాన్ని పోలీసులు ఇన్ని రోజులు గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ వార్త బయటకు రావడంతో చర్చనీయాంశంగా మారింది. యువతి చేసిన ఆరోపణలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు ముగిసిన తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది.

# శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు వర్షాలు..
## ఏపీఎస్డీఎంఏ అలర్ట్

**అమరావతి సెప్టెంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):**



బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో రానున్న కొన్ని గంటల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. రాగల 6 గంటల పాటు శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు ఉన్న జిల్లాల్లో అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.
ముఖ్యంగా కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లో రాగల రెండు గంటల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ వర్షాలతో పాటు గంటకు 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. పైన పేర్కొన్న మూడు జిల్లాలు మినహా మిగిలిన చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల హెచ్చరికల దృష్ట్యా, అత్యవసరం అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని కోరారు.

# ప్రపంచంలోనే నాలుగో స్థానానికి!
## విదేశీ మారక నిల్వల్లో భారత్ సరికొత్త రికార్డు..


**న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):**



భారతదేశ ఆర్థిక వ్యవస్థ మరో కీలక మైలురాయిని అందుకుంది. ఆర్బీఐ చేపట్టిన ప్రత్యేక పథకం కారణంగా దేశంలోకి డాలర్ల ప్రవాహం రికార్డు స్థాయిలో పెరగడంతో, విదేశీ మారక నిల్వలు (ఫారెక్స్ రిజర్వ్స్) ఆల్-టైమ్ గరిష్ఠానికి చేరాయి. దీంతో ఫారెక్స్ నిల్వలు కలిగిన దేశాల జాబితాలో రష్యాను అధిగమించి భారత్ ప్రపంచంలోనే నాలుగో స్థానానికి ఎగబాకింది.
'బ్లూమ్‌బర్గ్' డేటా ప్రకారం.. సెప్టెంబర్ 4తో ముగిసిన వారంలో భారత ఫారెక్స్ నిల్వలు ఏకంగా 44.9 బిలియన్ డాలర్లు పెరిగి, 785.7 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 75,07,796 కోట్లు) రికార్డు స్థాయికి చేరాయి. ఈ భారీ పెరుగుదలతో ఇప్పటివరకు నాలుగో స్థానంలో ఉన్న రష్యాను భారత్ వెనక్కి నెట్టింది. ప్రస్తుతం ఈ జాబితాలో చైనా, జపాన్, స్విట్జర్లాండ్ మాత్రమే భారత్ కంటే ముందున్నాయి. ఆర్బీఐ ఈ ఏడాది జూన్ 8న ప్రవేశపెట్టిన ఫారెన్ కరెన్సీ నాన్-రెసిడెంట్ (బ్యాంక్) డిపాజిట్ల (ఖీజచీ=-దీ) స్పెషల్ స్వాప్ పథకానికి అనూహ్య స్పందన లభించడమే ఈ డాలర్ల వరదకు ప్రధాన కారణంగా నిలిచింది. ఈ పథకం ద్వారా కేవలం 11 వారాల్లోనే దేశంలోకి 73 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి. నిర్దేశిత లక్ష్యం గడువు కంటే ముందే నెరవేరడంతో, ఆర్బీఐ ఈ పథకాన్ని సెప్టెంబర్ 30కి బదులుగా ఆగస్టు 31నే ముగించింది. అంతర్జాతీయంగా బంగారం ధరలు తగ్గడంతో దేశ పసిడి నిల్వల విలువ 2.59 బిలియన్ డాలర్లు తగ్గినా, డాలర్ల ప్రవాహం అధికంగా ఉండటంతో మొత్తం నిల్వలు భారీగా పెరిగాయి.
విదేశీ మారక నిల్వలు ఇంత భారీగా పెరగడం దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతకు సంకేతమని, ఇది రూపాయి విలువలో హెచ్చుతగ్గులు వచ్చినప్పుడు స్థిరీకరించేందుకు ఆర్బీఐకి మరింత బలాన్ని ఇస్తుందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# ఏపీలో మద్యం షాపుల లైసెన్సులు
## మరో ఏడాదికి పొడిగింపు

**అమరావతిసెప్టెంబర్ 12 (జర్నలిస్ట్ వార్త):**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని మద్యం దుకాణాల లైసెన్సులకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. 2026-27 ఎక్సైజ్ విధానంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 3,736 మద్యం దుకాణాల లైసెన్సుల గడువును మరో ఏడాది పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పొడిగింపు నిర్ణయం అక్టోబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది.
ప్రస్తుత లైసెన్సుదారులు తమ అనుమతులను పునరుద్ధరించుకునేందుకు (రెన్యువల్) ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఎవరైనా లైసెన్సులను పునరుద్ధరించుకోని పక్షంలో, ఆయా దుకాణాలను లాటరీ పద్ధతి ద్వారా కొత్తవారికి కేటాయిస్తారు. ఈ లాటరీ ప్రక్రియలో పాల్గొనాలనుకునే వారు దరఖాస్తు రుసుము కింద తిరిగి చెల్లించబడని (నాన్-రిఫండబుల్) రూ. 3 లక్షలను చెల్లించాల్సి ఉంటుంది. కొత్త పాలసీలో భాగంగా ప్రభుత్వం నిఘా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేసింది. ప్రతి మద్యం దుకాణంలోనూ తప్పనిసరిగా నాలుగు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. నిబంధనల ఉల్లంఘనలను నిశితంగా పరిశీలించేందుకు 24 గంటల పాటు పనిచేసే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థను ప్రభుత్వం అమలు చేయనుంది. మరోవైపు, అక్రమ మద్యం తయారీ, విక్రయాలకు సంబంధించిన సమాచారం అందించిన వారికి ప్రభుత్వం రూ. లక్ష వరకు రివార్డును ప్రకటించింది. ఈ నూతన విధానం ద్వారా మద్యం అమ్మకాలపై పూర్తిస్థాయి నియంత్రణ సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది.